మంగళవారం। 13। ఆగస్టు। 2024



టన్ను చీనీ రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికాయి. మార్కెట్‌కు 190 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
$36.7^{0}/22.8^{0}$

జిల్లా పరిధిలో సోమవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

చౌకబారు నిర్ణయం

అస్తవ్యస్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థ

- ఎండీయూ వాహనాలకు కూటమి సర్కార్ మంగళం
- అటకెక్కిన ఇంటింటికీ రేషన్ పంపిణీ
- ఒక్కో పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కుట్ర
- గ్రామాల్లో రేషన్ షాపుల ఎదుట కార్డులదారుల బారులు
- దూరాభారంతో ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు



ఓడీ చెరువులో రేషన్ దుకాణం వద్ద ఈ నెల 8న పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

సాక్షి, పుట్టపర్తి

సూపర్ 'సిక్స్' అంటూ జనానికి వలవేసి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్.. ఒక్క పథకాన్నీ అమలు చేయలేదు. పైగా గత జగన్ సర్కార్ అమలు చేసిన ఒక్కో పథకానికి మంగళం పాడుతోంది. తాజాగా ఇంటింటికీ రేషన్ పథకాన్ని అటకెక్కించింది. ఇంటింటికీ రేషన్ పథకం నిలిపివేస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో స్వయంగా చంద్రబాబే ప్రకటించడంతో కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇక నుంచి చౌక ధరల దుకాణాల వద్ద పడిగాపులు తప్పవంటూ వాపోతున్నారు.

తప్పని తిప్పలు..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో నిరుపేదల ముంగిళ్లలోనే సంక్షేమ పథకాలు అందించారు. ఈ క్రమంలోనే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా రేషన్ సరుకులు అందజేసే కార్యక్రమానికి 2021లో శ్రీకారం చుట్టారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17 వరకూ ఈ పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో రేషన్ పంపిణీ చేశారు. మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేసి పథకాన్ని పకడ్బందీగా అమలు చేశారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఎంతో మేలు జరిగింది. రేషన్ బండే ఇంటి వరకూ రావడంతో సమయం ఆదా కావడంతో పాటు కూలి పనులు మానుకోవాల్సిన దుస్థితి తప్పింది. మరోవైపు ఎందరో నిరుపేదలకు ఎండీయూ ఆపరేట్లుగా ఉపాధి దక్కింది. అయితే కూటమి ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడుతోంది. దీంతో కార్డుదారులంతా మళ్లీ సుదూరంలో ఉన్న రేషన్‌దుకాణాల వద్దకు వెళ్లి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండీయూ ఆపరేటర్లుగా పనిచేస్తున్న వారి ఉపాధికి ఎసరొచ్చింది. ఇక వాహనం నెలవారీ కంతు చెల్లించడం ఎలా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

349	రేషన్ పంపిణీ చేసే వాహనాలు
5,62,784	జిల్లాలోని రేషన్ కార్డులు
8,700 మెట్రిక్ టన్నులు	పంపిణీచేసే బియ్యం
1,367	రేషన్ దుకాణాలు

రేషన్ సరుకుల్లోనూ కోత..

చంద్రబాబు ప్రభుత్వం వచ్చీ రాగానే రేషన్ సరుకుల్లో కోత విధించింది. కందిపప్పు, పంచదార పంపిణీకి మంగళం పాడేసింది. జూన్, జూలై మాసాల్లో కందిపప్పు, పంచదార సరఫరా నిలిపివేయడంతో పాటు ఆగస్టు నెల కూడా ఇవ్వలేదు. ఒక్కో కార్డుదారునికి అర కిలో చక్కెర రూ. 17కు, కిలో కందిపప్పు రూ.67కు అందించేవారు. పేదలకు ఎంతో ఉపయోగపడే ఇలాంటి సరుకుల పంపిణీ నిలిపివేసింది.



ఈ చిత్రంలో వ్యక్తి పేరు సాకే శివయ్య. తాడిమర్రి మండలంలోని పిన్నదరి గ్రామం ఎస్సీ కాలనీ. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే శివయ్య... మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాలు విరగడంతో ఇంటికే పరిమితమయ్యాడు. ప్రస్తుతం ఆయన భార్య కూలి పనులు చేస్తూ అండగా నిలుస్తోంది. గతంలో జగన్ సర్కార్ ఇంటి వద్దకే ఎండీయూ వాహనాలను పంపి రేషన్ అందజేసేది. దీంతో శివయ్యకు ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనాలు పక్కనపెట్టారు. దీంతో రేషన్ సరుకులు తీసుకోవాలంటే శివయ్య భార్య కూలి పనులు మానుకుని...రేషన్ డీలర్ ఇంటి ఎదుట బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. బియ్యం తెచ్చుకోవడానికి ఒక్కరోజు ఇంటి వద్ద ఉంటే కూలి నష్టపోతామని శివయ్య దంపతులు ఆందోళన చెందుతున్నారు.

బత్తలపల్లి మండలం చీమలనాగేపల్లి గ్రామంలో రేషన్ దుకాణం లేదు. దీంతో ఆ గ్రామంలోని కార్డుదారులు 5 కి.మీ దూరంలోని ఎం.చెర్లోపల్లి రేషన్ దుకాణం వద్దకు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ధర్మవరం నియోజకవర్గంలో 60 గ్రామాల కార్డుదారులు ఇలాంటి సమస్యే ఎదుర్కొంటున్నారు. రేషన్ బండి రాకపోతే ఎందరో నిరుపేదలు రేషన్ సరుకులకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

నాలాంటి వాళ్ల పరిస్థితి ఏంటో?



నేను చేతికర్ర లేనిదే నడవలేను. ప్రస్తుతం మా గ్రామ సమీపంలోని నల్ల గుట్టతండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేశారు. ఈ పరిస్థితుల్లో నేను అంతదూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే కష్టమే. నా లాంటి వృద్ధులు చాలా మందే ఉన్నారు.

– బుక్కే గ్యాంగిలమ్మ, గాజులవారిపల్లి పెద్దతండా, గాండ్లపెంట

ఇంటివద్దనే సరుకులివ్వాలి



రేషన్ సరుకులను గతంలోగా వాహనాల ద్వారా సరఫరా చేస్తే బాగుంటుంది. రేషన్ షాపుల వద్దకే వెళ్లి సరుకులు తీసుకోవాలంటే ఒక రోజు కూలి పనులు మానుకోవాల్సి ఉంటుంది. రెక్కల కష్టంపై ఆధారపడి బతికే మాలాంటి వారికి ఒకరోజు పనికి పోకున్నా ఇబ్బందే.

– జయరామప్ప, మామిడిమాకులపల్లి, లేపాక్షి

వాహనాలు ఉండాల్సిందే



మా గ్రామం కర్ణాటక సరిహద్దులో ఉంటుంది. గతంలో ఇంటి వద్దకే వచ్చి నిత్యావసర సరుకులు అందేవి. ప్రస్తుతం రేషన్ బండి రావడం లేదు. మేమే దూరంగా ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లాల్సి వస్తోంది. నాలాంటి ఎందరో వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మా లాంటి వారి కోసం రేషన్ వాహనాలు ఉండాల్సిందే.

– కెంచ వీరమ్మ, అగ్రహారం, అమరాపురం మండలం

జీవనోపాధికి ఇబ్బందే



నేను ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేస్తున్నా. వాహనం కొనుగోలు కోసం బ్యాంకు వద్ద తీసుకున్న రుణం కంతులు వారీగా చెల్లిస్తూ.. కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ పథకాన్ని తీసివేస్తే నాలాంటి వేలాది మంది జీవనోపాధికి ఇబ్బందులు పడతారు.

– నరసప్ప, నసనకోట, రామగిరి మండలం

న్యూస్‌రీల్

ఉత్తమ సేవలకు పురస్కారం



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జూన్ 1 నుంచి జూలై 31 వరకూ కుటుంబ నియంత్రణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రతిభ కనబరిచిన అధికారులకు, దంపతులకు కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్ సోమవారం పురస్కారాలు అందజేశారు. వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఎన్‌సీహెచ్ కౌన్సిలర్లు, దంపతులకు మూడు విభాగాల్లో లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి, ప్రశంసాపత్రాలను అందజేయడంతో పాటు నగదు పురస్కారాన్ని బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో కదిరి ఏరియా ఆస్పత్రి డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ ఎండీ హుస్సేన్, హిందూపురం గైనకాలజిస్ట్ డాక్టర్ నీరజ, ఎన్‌సీహెచ్ కౌన్సిలర్లలో సునీత, శ్రీవిద్య, ఏఎన్‌ఎం అనూరాధ, ఆశ కార్యకర్త జ్యోతి, శాసనకోట అమరావతి, శోభ, ఉత్తమ దంపతులుగా తబ్సుం, ఫయాజ్, నారాయణ ఉన్నారు.

ఆన్‌లైన్ పరీక్ష పరిశీలన



పరీక్షను తనిఖీ చేస్తున్న డీఈఓ మీనాక్షి

కదిరి అర్బన్: మండలంలోని కాళసముద్రం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ఆన్‌లైన్ ట్యాబ్ బేస్డ్ అసెస్‌మెంట్‌ను డీఈఓ మీనాక్షి పరిశీలించారు. కాళసముద్రం రెసిడెన్షియల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో కొత్తగా సీబీఎస్‌ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు విద్యార్థులకు ట్యాబ్ బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించినట్లు ఎంఈఓ చెన్నకృష్ణ తెలిపారు. అలాగే ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలనూ డీఈఓ సందర్శించారు. ఈ నెల 15న పంద్రాగస్టు వేడుకల్లో లంబాడి నృత్యం ప్రదర్శన ఇచ్చేందుకు విద్యార్థినులు చేస్తున్న రిహార్సల్‌ను తిలకించారు.

నాలుగు రోజులు వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: ఉపరితల ద్రోణి కారణంగా రాగల నాలుగు రోజులూ జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. భారత వాతావరణ శాఖ అమరావతి కేంద్రం నుంచి అందిన సమాచారం మేరకు మంగళవారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో మోస్తరుగా వర్ష సూచన ఉందన్నారు. ఒకట్రెండు ప్రాంతాల్లో భారీ వర్షం పడవచ్చని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచన ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుపాటు నమోదు కావచ్చని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రఘునాథరెడ్డి

పుట్టపర్తి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి సూచించారు. సోమవారం ఆయన కొత్తచెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, అధ్యాపకులతో కలసి విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు చంద్రమౌళి, రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'సర్‌ప్లస్' అసంబద్ధం

- సర్దుబాటు మార్గదర్శకాలపై ఉపాధ్యాయ సంఘాల భగ్గు



పుట్టపర్తి: ఉపాధ్యాయుల సర్దుబాటుపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలపై ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమంటున్నాయి. తాజా మార్గదర్శకాలు పూర్తి అసంబద్ధంగా ఉన్నాయని, ప్రభుత్వం తప్పుడు లెక్కలతో 'సర్‌ప్లస్' చూపుతోందని మండిపడుతున్నారు. ప్రస్తుతం చేస్తున్న ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదంటున్నారు. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయ విద్యా వ్యవస్థను గందరగోళానికి నెట్టేశారన్నారు. జిల్లాలో 1,200 మంది ఉపాధ్యాయులను మిగులుగా తేల్చడం అంటే... విద్యా వ్యవస్థలో ఉన్న డొల్లతనం బయటపడిందంటున్నారు. ప్రభుత్వం ఇలాగే నియంతృత్వ పోకడలు కొనసాగిస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ తీవ్ర నష్టానికి గురయ్యే అవకాశం ఉందంటున్నారు. తదుపరి ఉపాధ్యాయ వర్గం అంతా పోరాటానికి సిద్ధం అవ్వాల్సిన అవసరం ఉంటుందని హెచ్చరించారు. తక్షణమే సర్దుబాటు మార్గదర్శకాలను ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉపసంహరించుకోవాలి



టీచర్ల సర్దుబాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాలను వెంటనే ఉపసంహరించుకోవాలి. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఏదో మేలు చేస్తుందని భావించాం... కానీ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. టీచర్లు మిగులుగా ఉన్నారని ప్రభుత్వం భూతద్దంలో చూపించడం అన్యాయం.

– ఇంద్ర ప్రసాద్, జిల్లా ప్రధానకార్యదర్శి, వైఎస్సార్‌టీఎఫ్

ప్రభుత్వ పాఠశాలల నిర్వీర్యం



ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధంగా ఉన్న అంశాలను తొలగించాలి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఉంది. అనేక పాఠశాలలో ఏకోపాధ్యాయుడు ఉండటం వల్ల పాఠశాలను నడపటం కష్టంగా మారింది. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారంలో జిల్లాలో 1,200 మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారు. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం 200 మంది మించి ఉండరు. సర్‌ప్లస్ టీచర్లను అదే మండలంలో సర్దుబాటు చేయాలి.

– పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఎఫ్

పాఠశాలల మూసివేతకే..



టీచర్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తిగా అసంబద్ధమైన చర్య. వెంటనే ఉపసంహరించుకోవాలి. పని సర్దుబాటు పేరుతో 10 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలలను మూసి వేసేందుకు ప్రభుత్వం పూనుకున్నట్లు తెలుస్తోంది. కొత్త మార్గదర్శకాల వల్ల గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలు పెద్ద ఎత్తున మూత పడే అవకాశముంది. తాము అధికారంలోకి వచ్చిన తక్షణమే 117 జీఓను రద్దు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు.

– బదా హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ 1938

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 262 అర్జీలు



భూ ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పెడపల్లి సర్పంచ్, వైస్ సర్పంచ్, కాలనీ వాసులు

పుట్టపర్తి అర్బన్: ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్‌తో పాటు జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 262 అర్జీలు అందగా, వాటిని ఆయా శాఖలకు పంపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంతో ఆశతో కలెక్టరేట్ వరకూ వచ్చి అర్జీలిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయికి వెళ్లి గడువులోపు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డ్వామా పీడీ విజయ్‌ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ మంజువాణి, హౌసింగ్ పీడీ వెంకట రమణారెడ్డి, సర్వే ఏడీ రామకృష్ణ, ఎల్‌డీఎం రమణకుమార్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

- పుట్టపర్తి మండలం పెడపల్లి వద్ద సర్వే నంబర్ 564లో ప్రభుత్వం జగనన్న కాలనీతో పాటు గుడికి, అంగన్‌వాడీ కేంద్రానికి భూమిని కేటాయించిందని, అందులోని సుమారు 10 సెంట్ల భూమిని టీడీపీ నాయకుడు శ్రీరాంనాయక్ ఆక్రమించి భారీ భవనాన్ని నిర్మిస్తున్నారని గ్రామ సర్పంచ్ మంగ్లీబాయి, వైస్ సర్పంచ్ శ్రీనివాసులు, కాలనీ వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్నందున అక్కడ సెంటు రూ.5 లక్షలకుపైగా పలుకుతోందన్నారు. ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ వెంటనే ఆర్డీఓను పిలిచి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు

భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. సోమవారం ఆయన సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీసీ నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 30 వరకూ 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ఏ గ్రామంలో, ఏ తేదీ సభ ఉంటుందో మండలాల వారీగా తెలియజేస్తామన్నారు. ఈ సదస్సుల కోసం ఆర్‌ఓఆర్, ఒన్‌బీ, వెబ్‌ల్యాండ్, అడంగల్ వంటి రికార్డులన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. సదస్సుకు తహసీల్దార్‌తో పాటు ఏడుగురు అధికారులు హాజరవుతారని, ప్రజల నుంచి అందే ప్రతి అర్జీనీ ఆన్‌లైన్ చేసి అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటిస్తారన్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామన్నారు. ఏ చర్యలు తీసుకున్నా ఫిర్యాదుదారునికి తెలియజేస్తామన్నారు.

రెండు నెలల పాటు 'మీకు తెలుసా'

హెచ్‌ఐవీతో పాటు లైంగికంగా సంక్రమించే అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడానికి రెండు నెలల పాటు 'మీకు తెలుసా' కార్యక్రమం ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ కుమార్, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ తదితరులతో కలిసి 'మీకు తెలుసా' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. 2007లో జిల్లాలో హెచ్‌ఐవీ పాటివ్ కేసులు 156 ఉండగా, 2022 నాటికి 178కి చేరాయన్నారు. అనుమానం ఉన్న వారంతా సిగ్గు పడకుండా హెచ్‌ఐవీ రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. ఏఆర్‌టీ సెంటర్లలో నమోదు చేసుకుంటే మందులు ఉచితంగా ఇస్తారని, వాటిని వాడితే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలోఆర్డీఓ భాగ్యరేఖ, డీఎల్‌ఏటీఓ తిప్పయ్య, హెచ్‌ఐవీ జిల్లా కోఆర్డినేటర్ జీవీ రమణ, ఆంజనేయులు, సీఎఫ్‌ఐ వెంకట్ పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం పోలీస్ అధికారులతో కలిసి శిరసాని హిల్స్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 78వ స్వాతంత్య్ర దినోత్సవం జిల్లా ప్రజలకు గుర్తుండిపోయేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే ముఖ్య అతిథులు, వీఐపీలు, స్వాతంత్య్ర సమరయోధులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన స్టాళ్లు, బారికేడ్లు, వేదిక, షామియానా, తాగునీరు, సెక్యూరిటీ, సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, అధికారులకు ప్రశంసా పత్రాల పంపిణీ, పరేడ్ గ్రౌండు ముస్తాబు, కలెక్టరేట్ ముస్తాబు, విద్యుత్ దీపాలంకరణ తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్‌ఓ కొండయ్య, ఏఎస్పీ విష్ణు, డీఎస్పీ వాసుదేవన్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ అనుపమ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.



19వ క్రస్ట్ గేట్ ద్వారా భారీగా నదికి వెళ్లిపోతున్న నీరు

మళ్లీ నిండేనా.. ఆశలు పండేనా?

తుంగభద్ర జలాశయం 19వ క్రస్ట్ గేట్ ఆకస్మాత్తుగా కొట్టుకుపోవడంతో భారీగా నీరు వెళ్లిపోతోంది. దీంతో 1.80 లక్షల ఎకరాల ఆయకట్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం డ్యాంలోకి 25,571 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువన వర్షాలు కూడా తగ్గుముఖం పట్టాయి. జలాశయం ఖాళీ అయితే మళ్లీ నిండుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో వరుణుడు కరుణించి డ్యాం మళ్లీ నిండాలని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు. కాగా, వారంలోపు ఎలాగైనా నూతన గేటును ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

– అనంతపురం సెంట్రల్

క్లుప్తంగా

శనీశ్వరాలయం... 'స్వర్ణ' శోభితం!


శనీశ్వరస్వామి

పావగడ: దక్షిణ భారతదేశంలోనే ప్రముఖ ఆలయంగా గుర్తింపు పొందిన పావగడ శనీశ్వర స్వామి ఆలయానికి బంగారు కవచం పొదిగించే భారీ యోచనకు ఆలయ సమితి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం రూ.6.5 కోట్లను వెచ్చించనున్నారు. ఈ పని పూర్తి చేసేలా కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన శిల్పి గుండాచార్‌కు కాంట్రాక్టుకు ఇచ్చినట్లు స్థానిక ఎస్‌ఎస్‌కే సంఘం అధ్యక్షుడు సీఎస్ ఆనందరావు సోమవారం తెలిపారు. ఆరు నెలల్లోపు ఈ పనులు పూర్తి కానున్నాయి.

సీనియర్ డీఈఈపై కేసు నమోదు చేయాలి

- ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకుల డిమాండ్


నాగమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లు: అధికారుల నిరంకుశ పాలన పరాకాష్టకు చేరుకుందని, రైల్వే ఉద్యోగిని మాల నాగమణి మృతే ఇందుకు నిదర్శనమని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.ఇబ్రిమ్, జి.పాపరావు మండిపడ్డారు. అధికారి వేధింపుల తాళలేక డివిజన్ పరిధిలోని కదిరి రైల్వే సెక్షన్‌లోని టీఆర్‌డీ విభాగంలో జేఈగా పని చేస్తున్న మాల నాగమణి ఇటీవల ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి కారణమైన సీనియర్ డీఈఈ (టీఆర్‌డీ) సురేంద్రరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ గుంతకల్లు డివిజన్ శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ... నాగమణి మృతికి ముమ్మాటికి సీనియర్ డీఈఈ సురేంద్రరెడ్డి తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. బదిలీ విషయంలో ఆమెతో కఠినంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. రైల్వే పరంగా బాధిత కుటుంబానికి అందే బెనిఫిట్స్‌ను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్‌ఎం విజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కోశాధికారి కె.నాగేశ్వరరావు, గుంతకల్లు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సాయిబాబా, ఎం.మురళీకృష్ణ, డివిజన్ కోశాధికారి నాగరాజు నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశులు, అడిషనల్ సెక్రటరీ జీఎస్ కిషోర్‌కుమార్, డివిజనల్ మాజీ అధ్యక్షుడు కృష్ణసాయి, నాయకులు జీవీ రమణ, వెంకటేశ్వర్లు, పట్టణ నాయకులు కేఎల్ స్వామిదాసు. శ్రీనివాసరాజు, రమేష్ బాబు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

నోట్లో మట్టికొట్టిన చంద్రబాబు

- 'అమూల్' పాల సేకరణ రద్దు దుర్మార్గం
- పాలు పారబోసి కలెక్టరేట్ ఎదుట పాడి రైతుల నిరసన


పాలు పారబోసి నిరసన తెలుపుతున్న రైతులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అమూల్ డెయిరీ కార్యకలాపాలను సీఎం చంద్రబాబు నిలిపివేసి తమ నోట మట్టి కొట్టారంటూ పాడి రైతులు మండిపడ్డారు. పాల ధరలు అమాంతం తగ్గించడం, పాడి రైతులకు మేలు చేస్తున్న 'అమూల్' కార్యకలాపాలను రద్దు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లాలోని వివిధ మండలాల నుంచి పాడి రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. పాలు పారబోసి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతన్‌కు వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులు మాట్లాడుతూ... గత జగన్ సర్కార్ జగనన్న పాల వెల్లువ కార్యక్రమం కింద 'అమూల్' కార్యకలాపాలు జిల్లాలో ప్రారంభించిందని గుర్తుచేశారు. దీంతో పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న దాదాపు 2 వేల మంది రైతులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. అయితే సీఎం చంద్రబాబు తన సొంత డెయిరీ హెరిటేజ్‌కు మేలు చేసేందుకు వేలాది మంది పాడి రైతుల పొట్టకొట్టారని దుయ్యబట్టారు. ప్రస్తుతం 'అమూల్'కు పాలు పోసిన రైతుల నుంచి ప్రైవేటు డెయిరీలు పాల కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పాల ధరలు కూడా అమాంతం తగ్గించేశారన్నారు. దీంతో రోజుకు ఒక్కో రైతు కుటుంబంలో 10 నుంచి 40 లీటర్ల వరకూ పాలు వృథా అవుతుండగా, రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 'అమూల్' కార్యకలాపాలను పునరుద్ధరించాలని కోరారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.

ధరలు తగ్గించి పొట్ట కొట్టారు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ప్రైవేటు డెయిరీలతో ఒప్పందం చేసుకుని పాల ధరలను అమాంతం తగ్గించి తమ పొట్టకొట్టారని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ రెండో వారంలో లీటరు పాలు రూ.35 నుంచి రూ.40 వరకు పలికాయని, ఇప్పుడు రూ. 28కి మించి ధర రావడం లేదంటున్నారు. దీంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన పాడి ఆవులను మేప లేక సహకార సంఘాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే అమూల్ పాల సేకరణను పునఃప్రారంభించడంతో పాటు పాల ధరలు పెంచాలని కోరారు.

అమూల్ పాల సేకరణే మేలు



గత ప్రభుత్వం మహిళా పాడి రైతుల సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన అమూల్ పాల సేకరణ ఎంతో బాగుంది. మా కేంద్రానికి రోజుకు 500 లీటర్ల పాలు వచ్చేవి. ప్రస్తుతం డెయిరీ మూత వేయడంతో మా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అమూల్ పాల సేకరణను తిరిగి ప్రారంభించాలి. – **అమరావతి, మొటుకుపల్లి**

పాలను కొనుగోలు చేయలేదు



రోజూ అమూల్ పాల సేకరణ కేంద్రానికి పాలు పోసేవాళ్లం. ఈ రోజు మా పాలను ఏ ప్రైవేట్ డెయిరీ కూడా కొనుగోలు చేయడం లేదు. సుమారు 32 లీటర్ల పాలు వృథా అయ్యాయి. ఇలాగే కొనసాగితే నాలుగు ఆవులపై తీసుకున్న రూ.2 లక్షల రుణం కంతులెలా చెల్లించాలి. వెంటనే అమూల్ పాల సేకరణను ప్రారంభించాలి. – **శశికళ, కొలేపల్లి**

రుణం ఎలా తీర్చాలి?



ఇటీవల సహకార సంఘం నుంచి రూ.లక్ష రుణం తీసుకుని రెండు ఆవులు కొనుగోలు చేశాను. అమూల్ పాల సేకరణ కేంద్రానికి పాలు పోసేవాళ్లం. ఇప్పుడు పాలసేకరణ బంద్ చేశారు. రుణాలు ఎలా చెల్లించాలి. దీనికి కారణం సీఎం చంద్రబాబే. అమూల్ ప్రారంభించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. – **రామచంద్ర, కొలేపల్లి**

అంగన్‌వాడీ కార్యకర్తకు అరుదైన అవకాశం


నిర్మల

అనంతపురం సెంట్రల్: నగరంలోని నేతాజీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న కార్యకర్త నిర్మలకు అరుదైన అవకాశం దక్కింది. న్యూఢిల్లీలో ఈ నెల 15న జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొననున్నారు. పోషన్ అభియాన్ కార్యక్రమం అమలులో దేశంలోనే రాష్ట్రం మూడో స్థానంలో ఉంది. ఇందులో భాగంగా ప్రతి జిల్లా నుంచి ఉత్తమ కార్యకర్తలను ఎంపిక చేశారు. అనంతపురం నుంచి నిర్మలకు ఆ అవకాశం దక్కింది. ఢిల్లీ వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకావాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమెకు ఆహ్వానం అందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేతుల మీదుగా అవార్డు, మెమొంటోను ఆమె అందుకోనున్నారు.

పంద్రాగస్టు వేడుకలకు మహిమ


మహిమ

అనంతపురం కల్చరల్: న్యూఢిల్లీ వేదికగా జరిగే స్వాతంత్ర దినోత్సవంలో ప్రాతినిథ్యం వహించే అవకాశం అనంతకు చెందిన మహిమకు దక్కింది. ఈ మేరకు నెహ్రూ యువకేంద్ర అధికారులు మణికంఠ, శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఏపీ నుంచి ఐదు జిల్లాలకు చెందిన యువతను ఎంపిక చేయగా... ఇందులో అనంతపురంలోని విజయనగర లా కాలేజీ విద్యార్థిని మహిమ ఉన్నారు. ఎన్‌వైకే నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలు వికసిత భారత్, యువ ఉత్సవ్, మై భారత్, యూత్ పార్లమెంటు వంటి వాటిలో మహిమ చురుకుగా పాల్గొంటూ వచ్చారు. ఈ సందర్భంగా ఆమెను రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జీవన్, జయమారుతి అభినందించారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం... కనికరించండి

- ఎస్పీ రత్నను వేడుకున్న బాధితులు
- 'పోలీసు స్పందన'కు 35 వినతులు


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న


పిల్లలతో కలసి సమస్య వివరిస్తున్న వరలక్ష్మి

పుట్టపర్తి టౌన్: 'సమస్య పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం అయినా ఫలితం లేదు. మీరైనా కల్పించుకుని కనికరించండి మేడమ్' అంటూ ఎస్పీ వి.రత్నను పలువురు బాధితులు వేడుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 35 వినతులు అందాయి. ఎస్పీ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. ముఖ్యంగా భూకబ్జాలు, ఆర్థిక నేరాలు, రైతులను మోసం చేయడం, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు తదితర ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గోరంట్ల పరిసర ప్రాంతాల్లో నేరాలు ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టి వచ్చాయన్నారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావ్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్‌వీ సీఐ శ్రీహర్ష పాల్గొన్నారు.

న్యాయం చేయండి..

'నా భర్త చనిపోయి ఆరు నెలలవుతోంది. అత్తారింటి నుంచి ఆస్తి రాకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయంగా జోక్యం చేసుకుని నాకు, నా పిల్లలకు న్యాయం చేయండి' అంటూ ఎస్పీ రత్నను చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి వేడుకుంది. ముదిగుబ్బకు చెందిన లింగరాజుతో వివాహమైన వరలక్ష్మికి ముగ్గురు పిల్లలున్నారు. ఆరు నెలల క్రితం గుండెపోటుతో భర్త మృతి చెందారు. అప్పటి నుంచి తనకు దక్కాల్సిన 2.50 ఎకరాల భూమి, ప్రమాద బీమా పరిహారాన్ని ఇవ్వకుండా అత్త, ఆడపడుచులు అడ్డుకుంటున్నారు. ఆస్తి కోసం పిల్లలను, తనను చంపాలని ప్రయత్నిస్తున్నారంటూ బాధితురాలు వాపోయింది. స్పందించిన ఎస్పీ వెంటనే సంబంధిత డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలికి న్యాయం చేయాలని సూచించారు.

చేనేత రంగాన్ని పరిరక్షించాలి


నిరసన తెలుపుతున్న చేనేత కార్మికులు

ధర్మవరం: జిల్లాలో మరమగ్గాల వల్ల నిర్వీర్యమవుతున్న చేనేత రంగం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మవరంలో సోమవారం ధర్మాంబ వీవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతన్నలు నిరసన తెలిపారు. రామ్‌నగర్ నుంచి తోపుడు బండిపై చేనేత మగ్గాన్ని ఊరేగిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మరమగ్గాలలో పట్టు ఉత్పత్తులు యథేచ్ఛగా తయారు చేస్తున్న నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే చేనేత రంగం మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మవరంలో హ్యాండ్‌లూమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి మరమగ్గాలలో పట్టు చీరలను తయారు చేయకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి 3 సెంట్ల స్థలం మంజూరు చేసి మగ్గం షెడ్డు, ఇల్లు నిర్మించుకునేందుకు సాయం అందించాలన్నారు. అనంతరం డిమాండ్ల సాధనకు జిల్లా కేంద్రంలో హ్యాండ్‌లూమ్ ఏడీ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు చింతా శ్రీనివాసులు, మిట్టా చంద్రశేఖర్, చట్టా గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- 16 తులాలు బంగారం, వెండి స్వాధీనం

బత్తలపల్లి: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, 16 తులాల బంగారం, వెండిని స్వాధీనం చేసుకున్నట్లు బత్తలపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 3న అనంతసాగరం గ్రామంలోని కురుబ కొండమ్మ ఇంట్లో చోరీ జరిగింది. ఘటనపై డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు నేతృత్వంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా ఆధారాలతో అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన ఆది శ్రీనివాసులును సోమవారం అరెస్ట్ చేశారు. ఉమ్మడి జిల్లాలో 37 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు. నార్పల మండలం బొందలవాడలోనూ తాళం వేసిన ఇంట్లో చోరీ చేసినట్లు ఒప్పుకోవడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మహిళా దొంగల చేతివాటం

- ప్రయాణికురాలి నుంచి బంగారం అపహరణ
- వాటాల పంపకంలో తేడా రావడంతో ఘర్షణ


పోలీసుల అదుపులో ఉన్న మహిళా దొంగలు

బత్తలపల్లి: బస్సులో ప్రయాణికురాలి నుంచి బంగారు నగలు అపహరించుకెళ్లిన ముగ్గురు మహిళలు వాటాలు పంచుకోవడంలో తేడా రావడంతో ఘర్షణ పడ్డారు. విషయం తెలుసుకున్న బాధితురాలు వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... పుట్లూరు మండలం మడుగుపల్లికి చెందిన కోరే మోహనయ్య భార్య రాధమ్మ 8 తులాల బంగారం నగలతో ఆదివారం బత్తలపల్లి మండలంలోని యర్రాయపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చింది. సోమవారం ధర్మవరానికి వెళ్లి చీరలు కొనుగోలు చేసిన అనంతరం బత్తలపల్లికి చేరుకుని, తన మెడలోని బంగారాన్ని తీసి బ్యాగులో ఉంచుకుని నార్పల వెళుతున్న బస్సు ఎక్కింది. అదే బస్సులో ముగ్గురు మహిళలు ఆమెను అనుసరిస్తూ చేతి బ్యాగులో ఉన్న బంగారాన్ని వెంకటగారిపల్లి బస్టాప్ వద్ద అపహరించి, మాల్యవంతం వద్ద బస్సు దిగారు. బస్సు కొంత దూరం వెళ్లగానే బాధితురాలు తన బంగారు నగలు అపహరణకు గురైన విషయం తెలుసుకుని వెంటనే బస్సు దిగింది. అదే సమయంలో నార్పల వైపు నుంచి ద్విచక్రవాహనంలో వస్తున్న ఉపాధ్యాయుడిని ఆపి తన పరిస్థితి వివరించడంతో ఆయన ఆమెను ఎక్కించుకుని మాల్యవంతం బస్టాప్ వద్దకు చేరుకుని బస్సు దిగిన మహిళల గురించి ఆరా తీశారు. ఆటోలో వారు ముగ్గురూ బత్తలపల్లి వైపు వెళ్లినట్లు తెలుసుకుని వెంటనే అటుగా ప్రయాణమయ్యారు. గ్రామ శివారులోకి నర్సరీ వద్ద ముగ్గురు మహిళలు ఘర్షణ పడుతుండడం గమనించిన ఇద్దరూ వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి లాంగ్ చైను, కమ్మలు, రాళ్ల నెక్లెస్‌ను స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. నిందితులపై కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.



స్కూల్లో నిద్రపోయిన ఉపాధ్యాయుడికి మెమో

తనకల్లు: విద్యార్థులకు పాఠాలు చెప్పకుండా తరగతి గదిలో నిద్రిస్తున్న ఉపాధ్యాయుడికి మెమో జారీ అయింది. ఈ మేరకు ఎంఈఓ లలితమ్మ సోమవారం తెలిపారు. తనకల్లు మండలం పరాకువాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయుడు కె.రామాంజనేయులును మరో పాఠశాలకు సర్దుబాటు చేశారు. అయితే సోమవారం ఎంఈఓకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామంలోని పాఠశాలకు హాజరైన రామాంజనేయులు... కొద్దిసేపటికే తరగతి గదిలో గాఢ నిద్రలోకి జారుకున్నాడు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని టీచర్ నిద్రపోతున్న దృశ్యాన్ని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ విషయంపై స్పందించిన ఎంఈఓ వెంటనే సదరు ఉపాధ్యాయునికి మెమో జారీ చేశారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడిపై దాడి

పుట్టపర్తి: అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా... కూటమి ప్రభుత్వంలో దాడులు ఆగడం లేదు. టీడీపీ నేతలు కక్ష పూరితంగా వ్యవహరిస్తూ దాడులకు తెగబడుతున్నారు. తాజాగా ఆదివారం రాత్రి బుక్కపట్నం మండలం మారాల ఎస్సీ కాలనీలో నివాసముంటున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామమోహన్‌పై దాడి చేశారు. సకాలంలో అక్కడే ఉన్న గ్రామస్తులు అడ్డుకోవడం పెను ప్రమాదం తప్పింది. తాను బజారులో ఉండగా అకారణంగా గ్రామానికి చెందిన రాజేష్, భాస్కర్ స్కూటర్‌పై వచ్చి తన స్కూటర్‌ను ఢీ కొట్టేందుకు ప్రయత్నించారని, ఎందుకు తనపై దాడి చేస్తున్నారని ప్రశ్నిస్తే నిన్ను చంపితే ఏమి చేస్తావంటూ ఘర్షణ పడ్డారని బాధితుడు వాపోయాడు. ఘటనపై సోమవారం బుక్కపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.